క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మైదుకూరు : మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, వనిపెంట సబ్ స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి బుధవారం రాత్రి ఎనిమిది గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ భరణికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం నుంచి వచ్చే మైదుకూరు–కడప విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయని, కొంతసేపు సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసుల తనిఖీలు



పార్శిల్‌ను తనిఖీ చేస్తున్న సీఐ రమణారెడ్డి

మైదుకూరు: గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు పార్శిల్ సర్వీస్ కార్యాలయాల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాన్స్‌పోర్టు, పార్శిల్ సర్వీస్ కార్యాలయాల్లో రవాణా చేసేందుకు వచ్చిన పార్శిళ్లను అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తనిఖీ చేశారు. గంజాయి రవాణా గురించి ఏమైనా సమాచారం ఉంటే తెలియజేయాలని సీఐ పార్శిల్ సర్వీసెస్ నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో అర్బన్ ఎస్‌ఐ ఎస్.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ఘన నివాళి

పోరుమామిళ్ల : సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ఆ పార్టీ నేతలు ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవ మాట్లాడుతూ విద్యార్థి, యువజన, కార్మిక, రైతాంగ వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. ఎంతోమంది యువకులను ఉద్యమాల వైపు నడిపిన రథసారథి అన్నారు. చేయని తప్పుల కోసం జైలు జీవితం గడిపి అనారోగ్యం కొని తెచ్చుకుని శనివారం మృతి చెందాడన్నారు. కార్యక్రమంలో ఫిరోజ్, సఫా, శ్రీనివాసులు, పీరయ్య, వెంకటసుబ్బయ్య, పోలమ్మ, కళావతి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ సభ్యుడిగా మౌలాలిసాబ్



మౌలాలి సాబ్‌కు అభినందనలు తెలుపుతున్న అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యునిగా నూర్ బాషా దూదేకుల సంఘం నుంచి తొండలదిన్నె మౌలాలిసాబ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం నజీరుల్లా మసీదులో అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్‌ను తొండలదిన్నె మౌలాలి సాబ్ కలిశారు. ఈ సందర్భంగా తనను కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదులు దాదాపీర్, జిలానీబాషా, మండిమర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రోషన్, దూదేకుల సంఘం ప్రెసిడెంట్ రాజేశ్‌బాబు, మాజీ ప్రెసిడెంట్ శేషయ్య, సి.బాషా, ఎస్.బాబయ్య, ఆర్.బాబయ్య, టి.పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కదిరి టౌన్: బతుకు తెరువు కోసం వైఎస్సార్ కడప జిల్లా నుంచి వలస వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన హాజీవలి (24) బతుకు తెరువు కోసం కదిరికి వచ్చి స్థానిక అరబిక్ రెస్టారెంట్‌లో పనిచేస్తూ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న అద్దె గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం వేకువజాము 2 గంటల సమయంలో మిత్రులతో కలిసి భోజనం చేసిన అనంతరం కవర్లు పడేసేందుకు గది నుంచి బయటకు వచ్చిన హాజీవలి.. పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన మిత్రులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. హాజీవలి తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జోరుగా వరి నాట్లు



వరినాట్లు వేస్తున్న కూలీలు

రాజుపాళెం : కుందూ, కేసీ కాలువ పరవళ్లు తొక్కుతున్నాయి. పుష్కలంగా సాగునీటిని విడదల చేస్తున్నారు. బ్రాంచ్ కాలువల నుంచి మైనర్ కాల్వల వరకు నీటితో కళకళలాడుతున్నాయి. దాదాపు అన్ని కాలువలకు నీటిని సరఫరా చేస్తుండటంతో పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వరి నారుమళ్లు పోసిన రైతులు వరి నాట్లు వేసుకోనేందుకు బిజీగా ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు సాగులో అన్నదాతలు తీరికలేకుండా ఉన్నారు.

చవితికి ముస్తాబవుతున్న గణపతి

- పట్టణంలో 10కి పైగా విక్రయ కేంద్రాలు
- ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్న విగ్రహాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితిని పురస్కరించుకుని వివిధ రూపాల్లో విఘ్నేశ్వర విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. పండుగకు కొన్ని రోజులు మాత్రమే సమయం ఉండటంతో.. కళాకారులు ప్రతిమలను తయారు చేయడంలో తలమునకలై ఉన్నారు. పట్టణంలో సినీహబ్, మోడంపల్లె బైపాస్‌తోపాటు పలు ప్రాంతాల్లో విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఒక అడుగు మొదలుకుని దాదాపు 15 అడుగులకుపైగా విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తున్నారు. పట్టణంలో 10కి పైగా పెద్ద విగ్రహాలను విక్రయించే కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం దాదాపు 2000పైగా విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉండటంతో విగ్రహాల తయారీదారులు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే కొన్ని విగ్రహాలకు అడ్వాన్స్‌లు ఇచ్చి ఉత్సవ కమిటీల వారు బుక్ చేసుకున్నారు. కొందరు ఉత్సవ కమిటీల వారు హైదరాబాదు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు పట్టణంలోనే తమకు నచ్చిన రూపంలో విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. వెయ్యి రూపాయల నుంచి లక్ష రూపాయలకు పైగా వివిధ రూపాల్లో విగ్రహాలు దర్శనమిస్తున్నాయి.

వేరే ప్రాంతాల కళాకారులతో తయారీ

వినాయక చవితికి 5 నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తారు. హైదరాబాదు దూల్‌పేట, రాజస్థాన్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సుమారు 200 మందికిపైగా కళాకారులు వచ్చి విగ్రహాలను అచ్చుపోసి వెళుతుంటారు. మరి కొన్ని చోట్ల ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు పట్టణంలోనే ఉండి విగ్రహాలు తయారు చేస్తున్నారు. వినాయక విగ్రహాలను పట్టణానికి చెందిన, ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు శ్రమించి జీవకళ ఉట్టిపడేలా రూపొందిస్తున్నారు. విగ్రహాన్ని పూర్తిగా సిద్ధం చేయడం, రంగులు వేయడం, మెరుగులు దిద్దడం చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి ముడిసరుకులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

విగ్రహాల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను రాజస్థాన్ నుంచి, కొబ్బరిపీచును పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి, రంగులను హైదరాబాదు, కట్టెలను కడప, ఆదోని ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. విగ్రహాలను ఏర్పాటు చేసే షెడ్డుకు బాడుగ, నిర్మాణానికి లక్ష రూపాయల నుంచి రూ.1.5 లక్షల వరకు ఖర్చు అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

వివిధ రూపాల్లో..

వినాయక విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేయడంలో ప్రొద్దుటూరు కళాకారులు ప్రసిద్ధి. విష్ణు గణపతి, రాధాకృష్ణగణపతి, బ్రహ్మ విష్ణుమహేశ్వర గణపతి, సింహవాహన, గజవాహన, ఎలుక వాహన, వెంకటేశ్వర, శివపార్వతుల గణపతి తదితర రూపాల్లో విగ్రహాలను తయారు చేయడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తెప్పిస్తారు. దీంతో తిరుపతి, బెంగళూరు, కర్నూలు, కడప జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు.

పూజకు వేళాయే..

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సమీపిస్తున్న నేపథ్యంలో భారీ గణనాథుని విగ్రహాలు పూజలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడు పట్టణంతో పాటు రూరల్ పరిధిలో, గోపవరం మండలం పరిధిలో సుమారు 300కు పైగా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. పండుగ సమీపిస్తుండటంతో నిర్వాహకులు విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. స్థానిక బైపాస్‌రోడ్డులో, గుంతపల్లె క్రాస్‌రోడ్డులో, నెల్లూరురోడ్డు, మైదుకూరురోడ్డులలో రాజస్థాన్ కళాకారులు తయారు చేసిన వివిధ ఆకృతుల్లోని గణేశప్రతిమలతో పాటు కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుండి తెప్పించిన గణేశప్రతిమలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ 6 నుండి 15 అడుగుల ఎత్తు ప్రతిమలు ఉండటంతో వివిధ ప్రాంతాల నుండి కొనుగోలు చేయడానికి వస్తున్నారు. ఇప్పటికే చాలా మంది నిర్వాహకులు అడ్వాన్స్‌లు చెల్లించి ప్రతిమలను ఎంపిక చేసుకున్నారు.





గణేశ ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు



నంది వాహనంపై కొలువుదీరిన ఆకారంలో ఉన్న వినాయకుని ప్రతిమ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న భారీ వినాయక ప్రతిమలు


90 శాతం ఆర్డర్లు పూర్తయ్యాయి



వినాయక చవితి ఈనెల 27 అవడంతో ఇప్పటికే 90 శాతం వరకు విగ్రహాలను ఉత్సవ కమిటీల వారు బుక్ చేసుకున్నారు. కడప, రాజంపేట, పులివెందుల తదితర ప్రాంతాలతోపాటు విజయవాడ, చెన్నై, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల వారు వచ్చి విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు. 5 నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తాం.

- సురేష్, విక్రయదారుడు, ప్రొద్దుటూరు

రాజస్థాన్ నుంచి వచ్చాను



ప్రత్యేక వినాయక విగ్రహాలను రూపొందించేందుకు రాజస్థాన్ నుంచి వచ్చాను. పట్టణానికి వచ్చి నాలుగు నెలలు అవుతోంది. విగ్రహాలు రూపొందించడం, తుది మెరుగులు దిద్దడం చేస్తున్నాను. పండుగ అనంతరం తిరిగి వెళతాను.

- లక్ష్మణ్, కళాకారుడు, రాజస్థాన్

సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు అన్యాయం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ పార్కు వద్ద ప్లకార్డులతో దివ్యాంగులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను ఆపాలన్నారు. పోలియో వ్యాధితో కాళ్లు చచ్చుబడిన, బదిరులు, అంధులు, మానసిక దివ్యాంగులు చాలా ఏళ్ల నుండి పింఛన్ పొందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వైద్యాధికారులచే దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించారన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి సచివాలయాల్లో దివ్యాంగులందరికి కొత్త సదరం సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. ఆ సర్టిఫికెట్లలో అనేక తప్పులున్నాయని, లబ్ధిదారుల ఫొటోలను మార్చారని, పేర్లను, పర్సంటేజీని తప్పుగా నమోదు చేశారన్నారు. సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దివ్యాంగుల్లో టెంపరరీ సర్టిఫికెట్ ఇచ్చిన వారికి నోటీసులు రద్దు చేసి, వారి పింఛన్ కొనసాగించేందుకు ఆదేశాలు ఇచ్చామని ప్రకటించారన్నారు. పాత సర్టిఫికెట్ల గురించి ఆయన ప్రకటించలేదన్నారు. సదరం సర్టిఫికెట్లలో జరిగిన తప్పులు సవరించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లలో తప్పులను సరి చేసి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజామొహిద్దీన్, మహేష్‌కుమార్, ఓబులేసు, నారాయణ స్వామి, గురప్ప, అబ్దుల్ రషీద్, యదార్థుడు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ లింగప్ప

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. ఆదివారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. ఎవరైనా లైసెన్స్ లేని డ్రైవర్లు ఉంటే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి పోలీసుశాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు అసాంఘీక కార్యకలాపాల, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఆటోకు తప్పనిసరిగా పోలీసుస్టేషన్‌లో పీసీ నెంబర్ పొందాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ–2 కె.జయరామిరెడ్డి, పీఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి వినాయకుడిని ప్రతిష్టిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్లను ఆదివారం స్థానిక అర్బన్‌స్టేషన్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించడం ఉత్తమమన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో భక్తుల సందడి



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా



విద్యుద్దీపకాంతులతో దర్గా



ఫాతేహా చదివిస్తున్న ప్రముఖులు

కడప పెద్ద దర్గాలో ఆదివారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌లో ఆదివారం శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి వారి సహకారంతో సీపీఎం, సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు బాబు, చెన్నారెడ్డి, సుబ్బారావు, ఐద్వా కడప జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ కార్యదర్శి సర్వేశ్వరి, అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, ఝాన్సీరాణి, విజయకుమారి, డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీ ఫీడర్ కింద గాయత్రీ నగర్, సాయినగర్, రెడ్డి నగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఉత్తర విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు క్రాసింగ్ వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతులు తప్పనిసరి



కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న శివప్రసాద్

బ్రహ్మంగారిమఠం : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే మండపాలకు కమిటీ సభ్యులు అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా మైక్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు క్రైం : అందరూ ఐకమత్యంగా ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. రూరల్ పరిధిలోని శంకరాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఏదైనా చిన్నపాటి సమస్య వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని తెలిపారు. ఫ్యాక్షన్ జోలికి పోరాదని సూచించారు. ఫ్యాక్షన్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అలాగే సైబర్ నేరాల గురించి అవగాహన కలిగించారు. వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా ఏర్పాటు చేయాలి



సమావేశం అనంతరం ఐక్యత చాటుతున్న ప్రత్యేక జిల్లా సాధన సమితి నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంతో పాటు మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాలను, బద్వేలుకు సమీపంలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలను కలుపుకుని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రత్యేక జిల్లా సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, డి.చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ సభాభవనంలో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సాధన సమితి సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బద్వేలు నియోజకవర్గాన్ని ఇతర జిల్లాల్లోకి మార్చే బదులు బద్వేలు కేంద్రంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి పేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో విశ్రాంత ఇరిగేషన్ ఎస్‌ఈ ధనుంజయ, తెలంగాణ సెక్రటేరియట్ విశ్రాంత ఏడీ సింగసానిరవి, ప్రత్యేక జిల్లా సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యక్షులు పిచ్చయ్య, కేశవయ్య, ప్రసాద్, ప్రచార కార్యదర్శి రమేష్‌యాదవ్, ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎస్‌ఎంయూఏ డిపో నాయకులు జనార్దన్, పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ బ్రహ్మయ్య, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డు ఉద్యోగికి ఘన స్వాగతం



కోస్ట్‌గార్డు రమణారెడ్డిని సన్మానిస్తున్న సంఘసేవకుడు రమణారెడ్డి

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన పాలకొలను నారాయణరెడ్డి, వీరమ్మల కుమారుడు రమణారెడ్డి భారత నౌకాదళంలో కోస్ట్‌గార్డు ఉద్యోగం చేస్తున్నారు. పాకిస్థాన్ నౌకను వెంటాడి పాకిస్థాన్ చెరలో చిక్కుకున్న మన దేశ జాలర్లను రక్షించిన నౌకాదళంలో రమణారెడ్డి ఉండటం విశేషం. భారత ప్రభుత్వం ఈనెల 15న ప్రకటించిన సీజీసీ మెడల్‌కు ఎంపికయ్యారు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన రమణారెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు చిత్తారాజశేఖర్‌రెడ్డి, తెల్లపాడు మాజీ సర్పంచ్ కడప రమణారెడ్డి, ఉపాధ్యాయులు రోశిరెడ్డి, కె.జె.ప్రవీణ్‌కుమార్, దేవసాని నారాయణరెడ్డి, తెల్లపాడు ఎంపీటీసీ బసిరెడ్డి నారాయణరెడ్డి, సంఘసేవకుడు బి.ఎస్.నారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డిలు ఘన స్వాగతం పలికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జ్ఞాపికను అందజేశారు.

పోలీసుల అనుమతులు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్న పెద్దయ్య

చాపాడు : వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ముందుస్తు అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ చిన్న పెద్దయ్య పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవాల నిర్వహణపై ఆదివారం సాయంత్రం స్థానికులకు అవగాహన కల్పించారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. ఐదు మంది సభ్యులతో కమిటీ ఏర్పడి అనుమతి పొందాలని కోరారు. లౌడ్ స్పీకర్లు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ వాడాలని, రాత్రి సమయాల్లో మండపాల వద్ద కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలని సూచించారు. పేలుడు పదార్థాలను పోలీసుల అనుమతి లేకుండా వాడరాదని హెచ్చరించారు.

ప్రశాంత ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ

బద్వేలు అర్బన్ : త్వరలో జరగనున్న గణేశ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని రూరల్ సీఐ ఎన్.కృష్ణయ్య కోరారు. ఆదివారం స్థానిక రూరల్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పీస్ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఆయా కమిటీలు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే ఆయా మంటపాల వద్ద తగిన భద్రత కల్పించుకునేందుకు నిర్వాహకులు వలంటీర్లను నియమించుకోవాలన్నారు. వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జనం రోజున డీజేలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు నిర్వహించకూడదన్నారు. ముఖ్యంగా నిమజ్జనాలకు వెళ్ళే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో రూరల్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్, పీస్ కమిటీ సభ్యులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో డీజేలు పెడితే కఠిన చర్యలు

రాజుపాళెం : వినాయక చవితి ఉత్సవాలు మొదలు వినాయక విగ్రహాలు నిమజ్జనం వరకు ఎక్కడైనా డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.వెంకటరమణ పేర్కొన్నారు. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడేగానీ డీజేలు పెట్టరాదని తెలిపారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి సౌండ్ ఎక్కువగా పెట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనన్నారు. విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో చిన్న పిల్లలు, మహిళలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి లేనిదే పెట్టవద్దని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలుంటే తమకు చెప్పాలన్నారు. రహదారులపై మండపాలు, వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయొద్దని, ఊరేగింపులో అసభ్య ప్రదర్శనలు, మద్యం, మత్తు పదార్థాలను వాడకూడదని తెలిపారు.